చిన్నారుల నైపుణ్యాన్ని పెంపొందించాలి

- నారాయణపేట కలెక్టర్ సిక్తా పట్నాయక్


చిన్నారులతో మాట్లాడుతున్న కలెక్టర్ సిక్తా పట్నాయక్

మక్తల్, డిసెంబర్ 19 : అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు ఆటపాటలతో నైపుణ్యాన్ని పెంపొందించాలని కలెక్టర్ సిక్తా పట్నాయక్ అన్నారు. ఈనెల 26న కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ సంపూర్ణత అభియాన్, కార్యక్రమానికి హాజరవుతున్న నేపథ్యంలో గురువారం కలెక్టర్ నర్వ మండలం పాతర్చేడ్, రాయికోడ్ గ్రామాల్లో పర్యటించారు. పాతర్చేడ్‌లోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించి, పాఠశాలలో మధ్యాహ్న భోజనం నాణ్యతను పరిశీలించారు. నాణ్యమైన భోజనం అందించాలని సూచించారు. రాయికోడ్‌లో అంగన్‌వాడీ కేంద్రాన్ని పరిశీలించి ప్రాథమిక విద్యలో నైపుణ్యతను సాధించేలా అంగన్‌వాడీ టీచర్లు చర్యలు చేపట్టాలన్నారు. కలెక్టర్ వెంట డీఆర్‌డీఏ మొగులప్ప, డీఎంహెచ్‌వో సౌభాగ్య లక్ష్మి, ఎంపీడీవో శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు.

అటవీ అడ్డంకులు తొలగించాలి

- ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి

నవాబ్‌పేట, డిసెంబర్ 19 : నవాబ్‌పేట మండలంలో ఎంతో పేరుగాంచిన ఫతేపూర్ మైసమ్మ ఆలయ అభివృద్ధికి అటవీ శాఖ అడ్డంకులను తొలగించాలని ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి కోరారు. అసెంబ్లీ సమావేశాల్లో భాగంగా గురువారం ఎమ్మెల్యే అనిరుధ్‌రెడ్డి మాట్లాడుతూ మైసమ్మ ఆలయానికి నిత్యం వేలాది మంది భక్తులు వచ్చి మొక్కులు చెల్లించుకుంటారని, రద్దీకనుగుణంగా వసతులు కల్పించాల్సి ఉందన్నారు. అక్కడ ఎలాంటి నిర్మాణాలు చేపట్టాలన్నా అటవీ అధికారులు అడ్డుకుంటున్నారని తెలిపారు. మంత్రి పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి స్పందించి సమస్య పరిష్కరిస్తామన్నారు.

ఫిర్యాదులపై వెంటనే స్పందించాలి

- ఎస్పీ యోగేశ్‌గౌతమ్

మాట్లాడుతున్న ఎస్పీ యోగేశ్‌గౌతమ్

నారాయణపేట, డిసెంబర్ 19: ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించాలని ఎస్పీ యోగేశ్‌గౌతమ్ సూచించారు. వార్షిక తనిఖీల్లో భాగంగా గురువారం పట్టణంలోని సీఐ కార్యాలయాన్ని తనిఖీ చేశారు. కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. కేసుల దర్యాప్తు, వర్టికల్స్ పనితీరు, కేసుల వివరాలను ఆన్‌లైన్ నమోదు తదితర అంశాలపై చర్చించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. సాంకేతిక వ్యవస్థపై దృష్టిసారించాలని, నూతన ఆప్స్, సీసీటీఎన్ఎస్‌పై అవగాహన ఉండాలన్నారు. శాంతిభద్రతలు పరిరక్షిస్తూ, ప్రజా ఫిర్యాదులను పరిష్కరించాలన్నారు. పాత నేరస్తులపై నిఘా ఉంచాలని, పోలీస్‌స్టేషన్‌కు వచ్చే బాధితులకు పూర్తి భరోసా, ధైర్యం ఇచ్చేలా విచారణ చేపట్టాలన్నారు. దొంగతనాల నివారణకు సీసీ కెమెరాలను పెంచాలన్నారు. కార్యక్రమంలో సీఐ శివశంకర్, ఎస్సైలు వెంకటేశ్వర్లు, రాజు, కృష్ణదేవ్, రేవతి, ఏఎస్సైలు పాల్గొన్నారు.

పెళ్లి పేరుతో మోసం చేసిన వ్యక్తికి పదేండ్ల జైలు శిక్ష

మక్తల్, డిసెంబర్ 19 : పెళ్లి చేసుకుంటానని నమ్మించి యువతిని మోసం చేసిన నిందితుడికి పదేండ్లు కఠిన కారాగారా శిక్షతోపాటు రూ.55వేల జరిమాన విధిస్తూ జిల్లా కోర్టు ప్రధాన న్యాయమూర్తి తీర్పునిచ్చినట్లు ఎస్పీ యోగేశ్ గౌతమ్ అన్నారు. గురువారం ఎస్పీ ఇందుకు సంబంధించిన వివరాలను విలేకరుల సమావేశంలో వెల్లడించారు. మక్తల్‌కు చెందిన యువతిని, ఇదే పట్టణానికి చెందిన ఈడిగ రాజేశ్‌గౌడ్ ప్రేమిస్తున్నానని చెప్పి హైదరాబాద్ తీసుకెళ్లి సహజీవనం చేసి, పెళ్లి చేసుకోవాలని కోరగా ఇంట్లో వాళ్లు ఒప్పుకోవడం లేదంటూ మోసం చేశాడని తెలిపారు. రాజేశ్‌పై చర్యలు తీసుకోవాలని గత ఆగస్టు 28నవ తేదీన మక్తల్ పోలీస్‌స్టేషన్లో ఫిర్యాదు చేసింది. అప్పటి ఎస్సై రాములు కేసు నమోదు చేయగా, అప్పటి సీఐ శంకర్ కేసు విచారణ చేపట్టి చార్జీషీట్ కోర్టులో సమర్పించారన్నారు. ప్రస్తుత మక్తల్ సీఐ చంద్రశేఖర్, ఎస్సై భాగ్యలక్ష్మిరెడ్డి, కోర్టు డ్యూటీ ఆఫీసరుల కబీర్, భీమ్‌రాజ్, లైజనింగ్ ఆఫీసర్ కృష్ణయ్యాగౌడ్ కోర్టులో సాక్షులను ప్రవేశపెట్టగా, పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఆకుల బాలప్ప వాదనలు వినిపించారు. గురువారం నిందితుడిపై నేరం నిరూపణ కావడంతో జిల్లా జడ్జి నిందితుడికి పదేండ్ల కఠిన కారాగార శిక్షతోపాటు రూ.55వేల జరిమానా విధిస్తూ తీర్పును వెల్లడించడం జరిగిందని ఎస్పీ వెల్లడించారు. కేసు ఛేదనలో కృషి చేసిన పబ్లిక్ ప్రాసిక్యూటర్, కోర్టు డ్యూటీ ఆఫీసర్లను ఎస్పీ అభినందించినట్లు

70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టివేత

మహబూబ్‌నగర్, డిసెంబర్ 19 : అక్రమంగా తరలిస్తున్న 70 క్వింటాళ్ల రేషన్ బియ్యాన్ని పట్టుకొని లారీ డ్రైవర్‌పై కేసు నమోదు చేసినట్లు మహబూబ్‌నగర్ రూరల్ ఎస్సై విజయ్‌కుమార్ తెలిపారు. ఇందుకు సంబంధించి ఎస్సై కథనం ప్రకారం.. గురువారం జిల్లా కేంద్రంలోని బండమీదిపల్లి సమీపంలో రవాణాశాఖ కార్యాలయం వద్ద దుర్గా రైస్‌మిల్ గోదాం వద్ద లారీలో బాలాజీ అనే మిల్లర్ వద్ద అక్రమంగా బియ్యం తరలిస్తున్నట్లు సమాచారం రావడంతో దాడి చేసి 70 క్వింటాళ్ల రేషన్ బియ్యం పట్టుకున్నట్లు తెలిపారు. లారీ డ్రైవర్ దేవరాజును అదుపులోకి తీసుకొని బియ్యపు లారీని పోలీస్‌స్టేషన్‌కు తరలించినట్లు తెలిపారు. ఈ మేరకు రైస్‌మిల్లు యజమాని బాలాజీపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై తెలిపారు.

ఇంట్లో నిద్రిస్తుండగానే చోరీ

మరికల్, డిసెంబర్ 19: మండల కేంద్రంలోని పాత కుర్వగేరిలో గురువారం ఇంట్లో అందరూ నిద్రిస్తుండగానే దొంగలు పడ్డారు. మండల కేంద్రంలోని పాత కుర్వగేరిలో ఆంజనేయులు ఇంట్లో నిద్రిస్తుండగా వెనక భాగం డోర్ నుంచి దొంగలు వచ్చి బీరువాలోని 20తులాల వెండి, తులం బంగారంతోపాటు రూ.30వేల నగదు ఎత్తుకెళ్లారు. అలాగే దండు బాలమ్మ ఇంట్లో దొంగలు పడి బంగారు దోచుకెళ్లేందుకు ప్రయత్నించగా శబ్దం రావడంతో మేల్కొనగా.. దొంగలు అక్కడి నుంచి పారిపోయారు. ఈ విషయమై ఆంజనేయులు ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు మరికల్ ఎస్సై రాము తెలిపారు.

మత్తుకు దూరంగా ఉండాలి

ఊట్కూర్, డిసెంబర్ 19 : విద్యార్థులు గంజాయి, డ్రగ్స్, మత్తు పదార్థాల వల్ల కలిగే అనర్థాలపై హెచ్‌ఎం మాధవి, నషా ముక్త్ భారత్ అభియాన్ వలంటీర్లు లక్ష్మీకాంత్, సంధ్య గురువారం స్థానిక జెడ్పీ బాలికల ఉన్నత పాఠశాల విద్యార్థులకు అవగాహన కల్పించారు.

తపస్ సంఘం నిరసన

నారాయణపేటరూరల్, డిసెంబర్19: పేట జిల్లాలో డీఎస్సీ 2024 ద్వారా ఎంపికైన ఉపాధ్యాయుల వేతనాల చెల్లింపులో తీవ్ర జాప్యానికి వ్యతిరేకంగా తెలంగాణ ప్రాంత ఉపాధ్యాయ సంఘం ఆధ్వర్యంలో గురువారం నిరసన వ్యక్తం చేసి ట్రెజరి అధికారికి వినతిపత్రం అందజేశారు.

ఎన్నికల విధులపై అవగాహన అవసరం

- ధరణి పెండింగ్ దరఖాస్తులు పరిష్కరించాలి
- మహబూబ్‌నగర్ కలెక్టర్ విజయేందిరబోయి

ఎన్నికల విధులపై అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ విజయేందిర బోయి

మహబూబ్‌నగర్ కలెక్టరేట్, డిసెంబర్ 19 : గ్రామ పంచాయతీ ఎన్నికల విధుల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులు తమ విధులపై అవగాహన కలిగి ఉండాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. గురువారం ఆమె కలెక్టరేట్‌లోని సమావేశ మందిరంలో గ్రామ పంచాయతీ రెండో సాధారణ ఎన్నికల నిర్వహణకు నియమించిన నోడల్ అధికారులతో కలెక్టర్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ రాష్ట్ర ఎన్నికల కమిషన్ ఆదేశాల మేరకు త్వరలో జరగనున్న గ్రామ పంచాయతీ ఎన్నికల నిర్వహణకు వివిధ విభాగాల్లో 12 మంది నోడల్ అధికారులను నియమించినట్లు తెలిపారు. ఎన్నికల నిర్వహణలో భాగంగా నోడల్ అధికారులకు కేటాయించిన విధులు, బాధ్యతలు ఖచ్చితంగా సమగ్ర అవగాహనతో నిర్వర్తించాలన్నారు. సమావేశంలో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్రప్రతాప్, డీపీవో పార్థసారథి తదితరులు పాల్గొన్నారు.

పెండింగ్ దరఖాస్తులపై ప్రత్యేక దృష్టి..

ధరణి పోర్టల్‌లో పెండింగ్ దరఖాస్తుల పరిష్కారంపై ప్రత్యేక శ్రద్ధ వహించాలని కలెక్టర్ విజయేందిరబోయి సూచించారు. గురువారం కలెక్టరేట్‌లోని మినీ కాన్ఫరెన్స్‌హాల్‌లో రెవెన్యూశాఖకు సంబంధించిన అంశాలపై కలెక్టర్ సమీక్షించారు. మండలాల వారీగా ధరణి దరఖాస్తుల పెండింగ్‌పై సమీక్షించారు. ఇసుక అక్రమ రవాణా నియంత్రించేందుకు, నీటి వనరుల భూముల ఆక్రమణకు గురికాకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రెవెన్యూ గ్రామాల వారీగా ల్యాండ్ బ్యాంక్‌ల నిర్వహణ చేయాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి ప్రభుత్వ భూమి స్థితిగతులు, వాటి వివరాలను ప్రత్యేక రిజిస్టర్‌లో పొందుపర్చాలన్నారు. సీలింగ్ ల్యాండ్ అసైన్‌మెంట్, దేవాదాయ ఇనాం వక్ఫ్ భూముల వివరాలను పొందుపర్చాలని కోరారు. సమావేశంలో అదనపు కలెక్టర్లు శివేంద్రప్రతాప్, మోహన్‌రావు, ఆర్డీవో నవీన్ తదితరులు పాల్గొన్నారు.

రాష్ట్రస్థాయి సత్తా చాటాలి..

మహబూబ్‌నగర్ అర్బన్, డిసెంబర్ 19 : రాష్ట్రస్థాయి పోటీల్లో జిల్లా క్రీడాకారులు సత్తా చాటాలని కలెక్టర్ విజయేందిర బోయి అన్నారు. గురువారం జిల్లా కేంద్రంలోని స్టేడియం మైదానంలో నిర్వహించిన సీఎం కప్ జిల్లా స్థాయి పోటీల ముగింపు సమావేశానికి హాజరై పోటీలో గెలుపొందిన క్రీడాకారులకు ప్రథమ, ద్వితీయ బహుమతులు అందజేశారు. అనంతరం కలెక్టర్ మట్లాడుతూ గ్రామస్థాయి నుంచి క్రీడాకారులను వెలికి తీసేందుకే సీఎం కప్ పోటీలు నిర్వహించినట్లు తెలిపారు. జిల్లా స్థాయిలో ప్రతిభ కనబరిచిన క్రీడాకారులు రాష్ట్రస్థాయిలో విజేతలుగా నిలవాలన్నారు. కార్యక్రమంలో అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, రాష్ట్ర మైనార్టీ కార్పొరేషన్ చైర్మన్ ఒబేదుల్లా కొత్వాల్, మున్సిపల్ చైర్మన్ ఆనంద్‌గౌడ్, మార్కెట్ కమిటీ చైర్మన్ అనిత, డీవైఎస్‌వో శ్రీనివాస్, ఒలింపిక్ సంఘం అధ్యక్షుడు వెంకటేశ్, ఎస్‌జీఎఫ్ సెక్రెటరీ శారదాబాయి, నిర్వాహకులు విలియం, బాలరాజు, జగన్‌మోహన్‌గౌడ్, నిరంజన్, వేణుగోపాల్ పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

మరికల్, డిసెంబర్ 19: మండల కేంద్రంలోని మహాత్మ జ్యోతిరావు పూలే గురుకుల పాఠశాలను గురువారం తాసీల్దార్ జమీల్ సందర్శించారు. ఈ సందర్భంగా మధ్యాహ్న భోజనాన్ని తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. విద్యార్థులకు మెనూ ప్రకారం భోజనం అందించాలని, నాణ్యత లేకుంటే చర్యలు తీసుకుంటామని తెలిపారు. ఆకుకూరలతో పప్పు వడ్డించాలని సూచించారు. భోజనంలో పురుగులు లేకుండా జాగ్రత్తలు తీసుకోవాలన్నారు. విద్యార్థులను అడిగి భోజన వివరాలు తెలుసుకున్నారు. మధ్యాహ్న భోజనానికి వినియోగిస్తున్న బియ్యాన్ని పరిశీలించారు. విద్యార్థులతో భోజనం వడ్డిస్తుండడంతో ఉపాధ్యాయులపై ఆగ్రహం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో ఆర్ఐ సుధాకర్‌రెడ్డి, ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

కేజీబీవీ పాఠశాల తనిఖీ

మరికల్, డిసెంబర్ 19: మండలంలోని పస్పులలో కేజీబీవీ గురుకుల పాఠశాలను గురువారం ఎంఈవో మనోరంజనీ ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఎంఈవో విద్యార్థినులతో మాట్లాడుతూ.. పదో తరగతి పరీక్షలకు విద్యార్థినులు సన్నద్ధం కావాలన్నారు. ఉపాధ్యాయులు సమ్మెలో ఉండడంతో సిలబస్ పూర్తికావడానికి సమస్య ఏర్పడిందని విద్యార్థినులు ఎంఈవోకు సూచించారు. సిలబస్‌ను పరీక్షల నాటికి పూర్తి చేసేందుకు చర్యలు తీసుకుంటామని ఎంఈవో హామీ ఇచ్చారు.

మధ్యాహ్న భోజనం పరిశీలన

జడ్చర్ల, డిసెంబర్ 19 : మండలంలోని కేజీబీవీని గురువారం ఎంఈవో మంజులాదేవి తనిఖీ చేశారు. తరగతి గదిలో విద్యార్థులకు పాఠాలను బోధించారు. అదేవిధంగా మధ్యాహ్న భోజనాన్ని పరిశీలించారు.

ఉపాధ్యాయులకు సన్మానం

ఉపాధ్యాయులను సత్కరిస్తున్న దృశ్యం

మక్తల్, డిసెంబర్ 19 : విద్యాశాఖలో ప్రభుత్వం చేపట్టిన పదోన్నతులు, స్థానచలనంలో భాగంగా పదోన్నతిపై వెళ్లిన ఉపాధ్యాయులను స్థానిక మండల ప్రజా పరిషత్ ప్రాథమిక పాఠశాలలో సన్మానించినట్లు ఎల్‌ఎఫ్‌ఎల్‌హెచ్‌ఎం పరందాములు తెలిపారు. పదోన్నతులు పొందిన వారిలో శాంతలక్ష్మి, కుర్మయ్య, తిరుమలరావు, చంద్రశేఖర్‌ను సన్మానించారు. కార్యక్రమంలో ఎంఈవో అనిల్ గౌడ్, శ్రీనివాస్ రెడ్డి, దీప, బాబు, అశోక్, అశోక్‌కుమార్ పాల్గొన్నారు.

కిక్‌బాక్సింగ్‌లో విద్యార్థి ప్రతిభ

జడ్చర్ల, డిసెంబర్ 19 : సీఎం కప్‌లో భాగంగా గురువారం మహబూబ్‌గనర్‌లో నిర్వహించిన కిక్‌బాక్సింగ్‌లో జడ్చర్ల విద్యార్థి రాఘవహర్సిత్ మొదటి బహుమతి సాధించాడు. జడ్చర్ల స్లోకా ఉన్నత పాఠశాలలో 7వ తరగతి చదువుతుండగా, కిక్ బాక్సింగ్‌లో మొదటిస్థానం పొందడంతో తలిదండ్రులు రాంరెడ్డి, రాధిక హర్షం వ్యక్తం చేశారు.

మంత్రివర్గం నుంచి తొలగించాలి

ధన్వాడ, డిసెంబర్ 19: రాజ్యాంగ నిర్మాత అంబేద్కర్‌ను అవమాన పరిచిన కేం ద్ర హోం శాఖమంత్రి అమీత్ షాను మంత్రివర్గం నుం చి బర్తరఫ్ చేయాలని డిమాండ్ చేస్తూ గురువారం మండల కేంద్రంలో బీఎస్పీ ఆధ్వర్యంలో రాస్తారోకో చేశారు.

కార్మికుల సమస్యలు పరిష్కరించాలి

ఎంపీవోకు వినతిపత్రం అందజేస్తున్న కార్మికులు

దేవరకద్ర, డిసెంబర్ 19 : గ్రామ పంచాయతీ కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా ఉపాధ్యక్షుడు వేణుగోపాల్, జిల్లా కార్యదర్శి సాంబశివుడు అన్నారు. గురువారం మండల పరిషత్ కార్యాలయం వద్ద గ్రామ పంచాయతీ కార్మికులతో కలిసి ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ పంచాయతీ కార్మికుల సమస్యలను పరిష్కరిస్తామని ఎన్నికల సమయంలో చెప్పిన కాంగ్రెస్ అధికారంలోకి వచ్చాక విస్మరించిందన్నారు. ఇప్పటికైనా ప్రభుత్వం కార్మికులకు ఇచ్చిన హామీలను అమలు చేయాలన్నారు. అనంతరం ఎంపీవో శ్రీనివాస్‌రెడ్డికి వినతిపత్రం అందజేశారు. కార్యక్రమంలో కార్మికులు రామంజమ్మ, ఆంజనేయులు, నర్సమ్మ, వెంకటమ్మ, అలివేలమ్మ, నర్సింహులు తదితరులు పాల్గొన్నారు.

మధ్యాహ్న భోజన కార్మికులకు వేతనాలివ్వాలి

నారాయణపేట టౌన్, డిసెంబర్ 19: ప్రభుత్వ పాఠశాలల్లో పని చేస్తున్న మధ్యాహ్న భోజన కార్మికుల సమస్యలు పరిష్కరించాలని సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాలరాం అన్నారు. గురువారం మధ్యాహ్న భోజన కార్మికులు కలెక్టరేట్‌లో కలెక్టర్ సిక్తాపట్నాయక్‌కు వినతిపత్రం అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. 9, 10 తరగతుల కోడిగుడ్ల బిల్లులు, 10నెలలుగా మెస్ బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయన్నారు. మూడు నెలలుగా వేతనాలు అందక మధ్యాహ్న భోజన కార్మికులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. సివిల్ సప్లై అధికారులు నాణ్యత లేని బియ్యం అందించడంతో వాటిని శుభ్రం చేసేందుకు ఒక మనిషిని కేటాయించుకొని ఆర్థిక భారం మోస్తున్నారని తెలిపారు. ప్రభుత్వం ఇచ్చే గుడ్డు రేటు, మార్కెట్‌లోని గుడ్డు రేటుకు తేడా ఉండడంతో గుడ్డుపై రూ.2 భారం పడుతుందన్నారు. పెండింగ్ బిల్లులు, వేతనాలు వెంటనే చెల్లించాలని కోరారు. వినతిపత్రం అందజేసిన వారిలో యాదమ్మ, మహదేవమ్మ, జ్యోతి, రామేశ్వరి తదితరులున్నారు.

ఆర్‌ఎన్‌ఆర్ ధాన్యం ధర రూ.2,692

నవాబ్‌పేట, డిసెంబర్ 19 : నవాబ్‌పేట వ్యవసాయ మార్కెట్ యార్డులో ఆర్‌ఎన్‌ఆర్ సన్నరకం ధాన్యానికి క్వింటాకు రూ.2,692 ధర పలికినట్లు మార్కెట్ కార్యదర్శి రమేశ్‌కుమార్ తెలిపారు. గురువారం ఒక్క రోజే 28,349 బస్తాల ధాన్యం వచ్చినట్లు ఆయన వివరించారు. కనిష్టంగా 2,652, దొడ్డురకం హంసకు రూ.2,226 ధర లభించినట్లు వివరించారు.

చట్టాలను తెలుసుకోవాలి

నారాయణపేటరూరల్, డిసెంబర్ 19: పేట మండలంలోని జిలాల్‌పూర్‌లో గురువారం జిల్లా న్యాయసేవాసంస్థ లీగల్ సర్వీసెస్ ఆధ్వర్యంలో న్యాయవిజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి అసిస్టెంట్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ సురేశ్, చీఫ్ లీగల్ ఎయిడ్ లక్ష్మీపతిగౌడ్, అసిస్టెంట్ లీగల్‌ఎయిడ్ నాగేశ్వరిలు హాజరై మాట్లాడారు. కార్యక్రమంలో కార్యదర్శి కీర్తి, గ్రామస్తులు పాల్గొన్నారు.

కందికి మద్దతు ధర కల్పించాలి

ధన్వాడ, డిసెంబర్ 19: కందిపంటకు మద్దతు ధరను కల్పించాలని బీఆర్‌ఎస్ నాయకులు గౌనిశ్రీనివాసులు డిమాండ్ చేశారు. గురువారం మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మట్లాడుతూ.. కంది పంటకు క్వింటాకు రూ.12వేలు మద్దతు ధరను ఇవ్వాలని డిమాండ్ చేశారు. నారాయణపేట మార్కెట్ యార్డులో వ్యాపారులు కుమ్మక్కై రైతులను మోసం చేస్తున్నారని విమర్శించారు. ధరను రూ.6వేలకు తగ్గించడం ఏంటని ప్రశ్నించారు.

గడ్డివాము దగ్ధం

నారాయణ పేట రూరల్, డిసెంబర్ 19: మండలంలోని బొమ్మన్ పాడ్ సమీపంలో గురువారం ప్రమాదవశాత్తు గడ్డివాము కరెంట్ షాక్‌తో దగ్ధమైంది. బొమ్మన్‌పాడ్‌కు చెందిన రైతు గొల్ల పెంటప్ప పొలం నుంచి ట్రాక్టర్‌లో గడ్డిని తరలిస్తుండగా.. కరెంట్ వైర్లు తగిలి మంటలు రావడంతో వెంటనే ఫైర్‌స్టేషన్‌కు ఫోన్ చేశారు. ఫైర్ సిబ్బంది వచ్చి మటలను అదుపు చేశారు.

అరెస్టులతో ఉద్యమాలను ఆపలేరు

మక్తల్, డిసెంబర్ 19 : అక్రమ అరెస్టులతో ఉద్యమాలను అణచివేయలేరని మాలమహానాడు మండలాధ్యక్షుడు బండారి బాలు అన్నారు. రాష్ట్ర కార్యవర్గం పిలుపు మేరకు గురువారం అసెంబ్లీ ముట్టడికి వెళ్తున్న నాయకులను పోలీసులు అరెస్టు చేసి పోలీస్ స్టేషన్‌కు తరలించడం సరికాదన్నారు.

ఒత్తిడిని జయించాలి

దేవరకద్ర, డిసెంబర్ 19 : ఉపాధ్యాయులు విధుల్లో ఒత్తిడిని జయించి విద్యార్థులకు సులభ రీతిలో విద్యాబోధన చేయాలని హైదరాబాద్‌లోని నిజాం ఇన్‌స్టిట్యూట్ వైద్యులు రాజశేఖర్, జయలక్ష్మి అన్నారు. మండలంలోని ప్రాథమిక పాఠశాలల్లో విధులు నిర్వహిస్తున్న ఉపాధ్యాయుకు గురువారం ఎమ్మార్సీలో ఫిజియోథెరపీపై అవగాహన కల్పించారు.

టీజీటీఏ జిల్లా కార్యవర్గం ఎన్నిక

నారాయణపేట టౌన్, డిసెంబర్ 19: పట్టణ శివారులోని నైపుణ్య శిక్షణాభివృద్ధి కేంద్రంలో గురువారం టీజీటీఏ(తెలంగాణ తాసీల్దార్ అసోషియేషన్) నూతన కార్యవర్గాన్ని ఎన్నుకున్నారు. కార్యక్రమానికి ముఖ్య అతిథులుగా టీజీటీఏ రాష్ట్ర అధ్యక్షుడు శ్రీరాములు, కార్యదర్శి రమేశ్ హాజరయ్యారు. టీజీటీఏ జిల్లా అధ్యక్షుడిగా జమీల్, ప్రధాన కార్యదర్శిగా దయాకర్ రెడ్డితోపాటు ఇతర కార్యవర్గ సభ్యులను ఎన్నున్నారు. అదేవిధంగా టీజీఆర్‌ఎస్‌ఏ కార్యవర్గం ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షుడిగా రవి, ప్రధాన కార్యదర్శిగా శ్రీకాంత్‌తోపాటు కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు.

కళాశాలకు భూమి అప్పగింత

కోస్గి, డిసెంబర్ 19: కోస్గి పాలిటెక్నిక్ కళాశాలగ అప్‌గ్రేడ్ చేస్తూ ఇంజినీరింగ్ కళాశాలగ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. గురువారం కోస్గి పట్టణంలోని సర్వే నెంబర్ 1737లోని 10ఎకరాల 8గుంటల భూమిని ప్రభుత్వ ఇంజినీరింగ్ కళాశాల ప్రిన్సిపాల్ ప్రొసీడింగ్ లేటర్లను కోస్గి తాసీల్దార్ శ్రీనివాసులు అందజేశారు. ఆర్ఐ సుభాశ్, సర్వేయర్ అరుణ ఉన్నారు.

కృష్ణయ్యగౌడ్ చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న లక్ష్మారెడ్డి

లింగంపేట మాజీ సర్పంచ్‌కు మాజీ మంత్రి నివాళి

జడ్చర్ల, డిసెంబర్ 19 : జడ్చర్ల మండలంలోని లింగంపేట మాజీ సర్పంచ్ కృష్ణయ్యగౌడ్ ఇటీవల రోడ్డు ప్రమాదంలో మృతిచెందాడు. గురువారం దశదినకర్మకు హాజరై మాజీ మంత్రి లక్ష్మారెడ్డి లింగంపేటకు వెళ్లి దశదినకర్మలో పాల్గొని కృష్ణయ్యగౌడ్ చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. లక్ష్మారెడ్డి వెంట మాజీ సర్పంచ్ హైమావతి వెంకట్‌రెడ్డి, బీఆర్‌ఎస్ నాయకులు యాదయ్య, మమతా నవీన్‌రెడ్డి, ఇంతియాజ్‌ఖాన్, ప్రణీల్, శంకర్‌నాయక్, శ్రీకాంత్, నాగిరెడ్డి, పర్మటయ్య తదితరులు ఉన్నారు.

జర్నలిస్ట్ కుటుంబానికి పరామర్శ

బాధిత కుటుంబాన్ని పరామర్శిస్తున్న ఆల వెంకటేశ్వర్‌రెడ్డి

భూత్పూర్, డిసెంబర్ 19 : ముసాపేటకు చెందిన జర్నలిస్టు రమేశ్ తల్లి శంకరమ్మ గుండెపోటుతో బుధవారం రాత్రి మృతిచెందింది. విషయం తెలుసుకున్న మాజీ ఎమ్మెల్యే ఆల వెంకటేశ్వర్‌రెడ్డి ముసాపేటకు చేరుకొని రమేశ్, కుటుంబ సభ్యులను పరామర్శించారు. శంకరమ్మ పార్థీవదేహం వద్ద పూలమాల ఉంచి నివాళులర్పించారు. నివాళులర్పించిన వారిలో బీఆర్‌ఎస్ మండలాధ్యక్షుడు లక్ష్మీనర్సింహ్మయాదవ్, మాజీ జెడ్పీటీసీ ఇంద్రయ్యసాగర్, బీఆర్‌ఎస్ నాయకులు కొండయ్య, రవీందర్‌గౌడ్ తదితరులు పాల్గొన్నారు.

బీఆర్‌ఎస్ నాయకుడికి చిట్టెం పరామర్శ

వెంకట్‌రెడ్డిని పరామర్శిస్తున్న చిట్టెం రామ్మోహన్‌రెడ్డి

ఊట్కూర్, డిసెంబర్ 19 : మండలంలోని ఓబ్లాపూర్‌కు చెందిన మాజీ సర్పంచ్ భీంరెడ్డి తండ్రి వెంకట్‌రెడ్డి ఇటీవల తేనెటీగల దాడిలో గాయపడి దవాఖానలో చికిత్సపొందాడు. చికిత్స అనంతరం ఇంటికి రావడంతో గురువారం మాజీ ఎమ్మెల్యే చిట్టెం రామ్మోహన్‌రెడ్డి వెంకట్‌రెడ్డిని పరామర్శించారు. ఆరోగ్యం గురించి ఆరా తీశారు. చిట్టెం వెంట మాజీ ఎంపీపీ వెంకట్రామారెడ్డి ఉన్నారు.

అగ్ని ప్రమాదాల నివారణపై అవగాహన

జడ్చర్ల, డిసెంబర్ 19 : అగ్ని ప్రమాదాలు జరిగినప్పుడు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై గురువారం జడ్చర్ల మండలంలోని గంగాపూర్ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ఫైర్‌స్టేషన్ సిబ్బంది అవగాహన కల్పించారు. మాక్‌డ్రిల్ నిర్వహించారు. ఆసుపత్రిలో ఉండే ఫైర్ పరికరాలతో మంటలను ఎలా అదుపుచేయాలో డెమో ద్వారా వివరించారు. కార్యక్రమంలో పీహెచ్‌సీ వైద్యులు నరేశ్, సంతోష్‌భవాని, ఫైర్ సిబ్బంది రాఘవేందర్, కేశవులు, పీహెచ్‌సీ సిబ్బంది శేఖర్, మహేందర్, సౌజన్య, సునీత, యాదమ్మ తదితరులు పాల్గొన్నారు.

పరిసరాల పరిశుభ్రత పాటించాలి

పైపులైన్ వేయిస్తున్న కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి

జడ్చర్ల, డిసెంబర్ 19 : మున్సిపాలిటీలోని 24వ వార్డులో గురువారం కౌన్సిలర్ ప్రశాంత్‌రెడ్డి పర్యటించారు. ఈ సందర్భంగా వివిధ కాలనీల్లోని కంపచెట్లు ఉండటంతోపాటు డ్రెయినేజీలు సరిగా లేకపోవడంతో మురుగు నిలిచి రోడ్లపైకి వస్తుండటంతో కౌన్సిలర్ జేసీబీ సాయంలో తొలగింపజేశారు. పైపులను వేయించి మురుగు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకున్నారు. కార్యక్రమంలో రమేశ్, గోపాలకృష్ణ, రమేశ్‌రెడ్డి, లక్ష్మయ్య, శ్రీనివాసులు, రఘు తదితరులు ఉన్నారు.

సర్వే పకడ్బందీగా చేపట్టాలి

సర్వే నిర్వహిస్తున్న అధికారులు

నవాబ్‌పేట, డిసెంబర్ 19 : ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులను ఎంపిక చేసేందుకు గ్రామాల్లో పంచాయతీ కార్యదర్శులు నిర్వహిస్తున్న ఇంటింటి సర్వే పకడ్బందీగా చేపట్టాలని ఎంపీడీవో జయరాంనాయక్ కోరారు. మండల కేంద్రంతోపాటు రుద్రారం, కొండాపూర్ గ్రామాల్లో చేపడుతున్న ఇంటింటి సర్వే కార్యక్రమాన్ని గురువారం ఎంపీడీవో పరిశీలించారు. ప్రతి ఇంటిని సర్వే చేసి ఆన్‌లైన్ పోర్టల్‌లో పొందుపర్చాలని కోరారు. కార్యక్రమంలో పంచాయతీ కార్యదర్శులు నరేశ్, చంద్రశేఖర్ ఉన్నారు.

నమస్తే తెలంగాణ క్లాసిఫైడ్స్

WANTED
★హరి డే కేర్ ఆసుపత్రిలో పని చేయుటకు నర్సింగ్ స్టాఫ్ కావలెను. సంప్రదించవలసిన సెల్ నెం.8328035779.
NT- MBNR

ప్రకటన
క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగిన రీతిలో క్షుణ్ణంగా విచారించు కోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో నమస్తే తెలంగాణ పత్రికకు ఏ విధమైన సంబంధం లేదు. బ్యాంక్ అకౌంట్ల ద్వారా డబ్బులు ట్రాన్స్‌ఫర్ / డిపాజిట్ చేయవద్దు. పాఠకులు ఈ విషయాన్ని గమనించగలరు.

To Book your Classified
4 lines Advt
Rs. 200/-
Only (B/W)
Additional Line
50/- Only
For Advertisement Enquiry
Please Contact...
9182777641
9182777654
9182777748

న్యాయమైన డిమాండ్లు నెరవేర్చాలి

- వినూత్న రీతిలో సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగుల నిరసన

మహబూబ్‌నగర్‌లో కళ్లకు నల్లగుడ్డలు ధరించి నిరసన తెలుపుతున్న ఎస్ఎస్ఏ ఉద్యోగినీలు

మహబూబ్‌నగర్ విద్యావిభాగం, డిసెంబర్ 19 : ప్రభుత్వం ఇచ్చిన హామీలు అమలు చేయాలని డిమాండ్ చేస్తూ సర్వ శిక్షా అభియాన్ ఉద్యోగులు చేపట్టిన నిరవధిక సమ్మె గురువారం నాటికి పదో రోజుకు చేరుకున్నది. పాలమూరులో టీటీడీ ఎదుట ఉన్న ధర్నా చౌక్ వద్ద కళ్లకు గంతలు కట్టుకుని నిరసన తెలిపారు. సమ్మెకు జీహెచ్‌ఎంల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మురళీకృష్ణ సంఘీభావం తెలిపారు. కాంగ్రెస్ ప్రభుత్వం హామీ ఇచ్చి 360 రోజులైనా ఇప్పటికీ స్పందించకపోవడం బాధాకరమన్నారు. అసెంబ్లీ సమావేశాల్లో సమగ్ర శిక్షా అభియాన్ ఉద్యోగుల సమస్యలపై సీఎం సమీక్షించి పరిష్కార చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. ఈ సమ్మెకు జిల్లా ప్రైవేటు పాఠశాలల అసోసియేషన్ జిల్లా అధ్యక్షుడు ఎన్.ప్రభాకర్, ఎంఈవోలు లక్ష్మణ్‌సింగ్, మంజులాదేవి, పీఆర్టీయూ జిల్లా అధ్యక్షుడు శ్యాంబాబు, ధూమర్ల నిరంజన్, జుర్రునారాయణ, సీపీఎం జిల్లా కార్యదర్శి రాములు, ఎస్‌ఎఫ్ఐ జిల్లా అధ్యక్ష, కార్యదర్శులు భరత్, ప్రశాంత్, కేవీపీఎస్ జిల్లా అధ్యక్షుడు మాణిక్యంరాజ్ తదితరులు సంఘీభావం తెలిపారు. కార్యక్రమంలో జేఏసీ జిల్లా అధ్యక్షుడు శ్రీనివాసులు, ప్రధాన కార్యదర్శి యాదగిరి, కోశాధికారి ఎండీ ఇక్రమ్, కార్యనిర్వాహక అధ్యక్షుడు ఖాజామైనొద్దీన్, చంద్రశేఖర్‌గౌడ్, విష్ణు, ఇంతియాజ్, వేణు, అన్వర్‌పాషా, హర్షకుమార్, సత్యం, అనసూయ, జ్యోతి, హరిత, ఇందిరా, నాగలక్ష్మి, బాలరాజు, రఘు, శ్రీనివాసులు, జ్ఞానేశ్వరీ, శంకరమ్మ, మమత తదితరులు పాల్గొన్నారు.

పనికి తగిన వేతనం ఇవ్వాలి..

నారాయణపేట టౌన్, డిసెంబర్ 19: సమాన పనికి సమాన వేతనం ఇవ్వాలన్న సుప్రీంకోర్టు తీర్పును పాలకులు అపహాస్యం చేస్తున్నారని తెలంగాణ రైతు సంఘం జిల్లా కార్యదర్శి అంజిలయ్యగౌడ్, సీఐటీయూ జిల్లా కార్యదర్శి బాల్‌రాం, తపస్ జిల్లా అధ్యక్షుడు శేర్‌కృష్ణారెడ్డి అన్నారు. పట్టణంలోని మున్సిపల్ పార్క్ వద్ద గురువారం సమగ్ర శిక్ష ఉద్యోగులు వంటావార్పు నిర్వహిస్తూ నిరసన చేపట్టి సమ్మెలో పాల్గొన్నారు. ఈ సమ్మెకు సంఘీభావం తెలుపుతూ వారు మాట్లాడారు. గతకొన్ని రోజులుగా సమగ్ర శిక్ష ఉద్యోగులను రెగ్యులర్ చేయాలని సమ్మె చేస్తున్నా ప్రభుత్వం పట్టించుకోకపోవడం విడ్డూరమన్నారు. తక్షణమే సమగ్ర శిక్ష ఉద్యోగులను విద్యాశాఖలో విలీనం చేసి పర్మినెంట్ చేయాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో రాజశేఖర్, గౌరమ్మ, గంగమ్మ, విజయ, రాజ్యలక్ష్మి, రాములు, నవీన్ తదితరులు పాల్గొన్నారు.